# త్రిత్వము, దిత్వము అనేది బైబిల్ బోధ కాదు:

---

**ఆది 1:1. ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను.**

దేవుడు అని అంటే హెబ్రీలో ఇక్కడ యెలోహీమ్ అని ఉంది. ఈ యెలోహీమ్ అనే పదాన్ని పట్టుకుని ఇది బహువచనం అంటూ అబద్దబోధకులు ప్రజలను మోసం చేస్తున్నారు. ఇక్కడనుండే త్రిత్వం ఉందని కొందరు, త్రిత్వం కాదు గాని దిత్వం (తండ్రి-కుమారుడు) ఇద్దరు ఉన్నారని మరికొందరు తప్పుడు బోధ చేస్తున్నారు. వాస్తవానికి ఇవి రెండు తప్పే:

**దేవుడు ఒక్కడే అని 10 ఆజ్ఞలలో మొదటి ఆజ్ఞ ఖండితంగా చెపుతుంది.**

నిర్గమ 20:2. నీ యెలోహీమ్ అయిన యావెను నేనే; నేనే దాసుల గృహమైన ఐగుప్తుదేశములోనుండి నిన్ను వెలుపలికి రప్పించితిని;

3. నేను తప్ప వేరొక యెలోహీమ్ నీకు ఉండకూడదు.

4. పైన ఆకాశమందేగాని క్రింది భూమియందేగాని భూమిక్రింద నీళ్లయందేగాని యుండు దేని రూపము నయినను విగ్రహమునయినను నీవు చేసికొనకూడదు; వాటికి సాగిలపడకూడదు వాటిని పూజింపకూడదు.

ద్వితీ 5:6. దాసుల గృహమైన ఐగుప్తుదేశములోనుండి నిన్ను రప్పించిన నీ యెలోహీమ్ అయిన యాహెను నేనే.

7. నేను తప్ప వేరొక యెలోహీమ్ నీకుండకూడదు.

8. పైనున్న ఆకాశమందే గాని, క్రిందనున్న భూమియందే గాని భూమి క్రిందనున్న నీళ్లయందే గాని యుండు దేని పోలికనైన విగ్రహమును చేసికొనకూడదు.

**ఇశ్రాయేలీయులు తరచుగా పలుకు వారి షమా లో వారు ఉచ్చరించే వాక్యం ఇదే:**

## ద్వితీ 6:4. ఇశ్రాయేలూ వినుము. మన యెలోహీమ్ అయిన యాహె అద్వితీయుడగు యాహె.

**అద్వితీయుడు అంటే ద్వితీయుడు కానివాడు అనగా రెండవవాడు కానివాడు అని అర్థం.**

మరి ఈ ఒక్కడే అని చెప్పుకున్న ఈయన దగ్గర ఎవరు ఉన్నారు అని మనం పరిశీలించి చూస్తే......... దేవదూతలు ఉన్నాయి: అవి ఎక్కడ ఉన్నాయి అని చూస్తే....

1.రాజులు 22:19. మీకాయా యిట్లనెను యాహె సెలవిచ్చిన మాట ఆలకించుము; **యాహె సింహాసనాసీనుడైయుండగా పరలోకసైన్యమంతయు**

**ఆయన కుడి పార్శ్వమునను ఎడమపార్శ్వమునను** నిలిచియుండుట నేను చూచితిని.

2.దిన 18:18. మీకాయా యూవె మాట వినుడి, **యూవె తన సింహాసనముమీద ఆసీనుడైయుండుటయు, పరమండల సైన్యమంతయు ఆయన కుడిప్రక్కను ఎడమప్రక్కను** నిలువబడుటయు నేను చూచితిని.

యెషయా 6:1. రాజైన ఉజ్జియా మృతినొందిన సంవత్సరమున అత్యున్నతమైన సింహాసనమందు ప్రభువు ఆసీనుడైయుండగా నేను చూచితిని; ఆయన చొక్కాయి అంచులు దేవాలయమును నిండుకొనెను.

2. **ఆయనకు పైగా సెరాపులు నిలిచియుండిరి; ఒక్కొక్కరికి ఆరేసి రెక్క లుండెను. ప్రతివాడు రెండు రెక్కలతో తన ముఖమును రెంటితో తన కాళ్లను కప్పుకొనుచు రెంటితో ఎగురు చుండెను.**

3. వారు సైన్యముల కధిపతియగు యూవె, పరిశుద్ధుడు పరిశుద్ధుడు పరిశుద్ధుడు; సర్వలోకము ఆయన మహిమతో నిండియున్నది అని గొప్ప స్వరముతో గాన ప్రతిగానములు చేయుచుండిరి.

**దేవుడు ఉన్నాడు: ఆయనతో పాటు దేవదూతలు ఉన్నారు అనునది మనకు స్పష్టం అయినది.**

## ఇప్పుడు త్రిత్వము, దిత్వము ఎక్కడుంది?

ఈ త్రిత్వ, దిత్వ సిద్ధాంతములు అన్నీ యషువ మెస్సీయ వచ్చి ఆరోహణుడై వెళ్ళిపోయాక వచ్చిన తప్పుడు సిద్ధాంతములు: అదీ ఇంతకీ

యషువ మెస్సీయ దేవుడా లేక దేవుని చేత పంపబడిన వ్యక్తియా అనే దానిమీద బైబిలు చదివే వారికి అనుమానములు ఏర్పడి తయారుచేసిన సిద్ధాంతములు ఇవి. వాస్తవానికి ఇశ్రాయేలీయులు/యూదులు ఎవ్వరూ త్రిత్వాన్ని నమ్మరు, దిత్వ సిద్ధాంతాన్ని కూడా నమ్మరు. ఎటొచ్చీ అన్య సాంప్రదాయం నుండి వచ్చిన అన్యులు ప్రవేశపెట్టిందే ఈ త్రిత్వ, దిత్వ సిద్ధాంతములు. వాక్య జ్ఞానం లేని క్రైస్తవులంతా ఇందులో కూరుకుపోయారు. యషువ మెస్సీయ వచ్చి ముప్పది మూడున్నర సంవత్సరములు ఈ భూమి మీద జీవించి ధర్మశాస్త్ర ప్రకారం ముప్పది సంవత్సరముల తరువాత యాజకత్వానికి వచ్చి మూడున్నర సంవత్సరములు బోధించి ఆయన వచ్చిన పని ముగించుకుని ఆరోహణుడై తేజోమయుడయ్యినా (వెలుగు అయ్యిపోయినా/దేవుడిగా తన స్థానానికి వెళ్ళిపోయినా) నేటికి ఇంకా క్రైస్తవులు ఆయనను అన్యుల్లా ప్రతి సంవత్సరము క్రిస్టమస్సు పేరుతో పుట్టించుచూ గుడ్ ఫ్రైడే పేరుతో చంపుతూ ఈస్టర్ సండే పేరుతో సమాధినుండి లేపుతూ నాటకాలకు రిహర్సల్స్ వేసేవారిలా నాటకాలు వేస్తున్నారు గాని ఆయనను దేవునిగా నేటి వరకు చూడటం లేదు. ఇది చాలా దౌర్భాగ్యమైన స్థితి. ఇద్దరు దేవుళ్ళను, ముగ్గురు దేవుళ్ళను సృష్టించుకుని అన్యుల కన్నా హీనంగా సమాజంలో నడుస్తున్నారు. కొంతమందికి ఇదే జీవనాధారం గనుక వారి పొట్ట పోషణకొరకు ఇవే బోధనలు చేస్తూ బ్రతికేస్తున్నారు. సత్యాన్వేషకులు వీరి తప్పుడు సిద్ధాంతముల బారినుండి/వీటిని అభ్యసించువారి బారినుండి బయటకు వచ్చి ఎంతో సంతోషముతో యషువ మెస్సీయను దేవునిగా గ్రహించి కొనియాడుచూ సంతోషంగా ఉన్నారు. వారే మెస్సియానిక్స్:

**త్రిత్వ, ద్విత్వ సిద్ధాంతులు వక్రీకరించి ఇక్కడ త్రిత్వం ఉందని లేదా ఇక్కడ ద్విత్వం ఉందని చెప్పడానికి ఉపయోగిస్తున్న వాక్యములు ఇప్పుడు మనం చూద్దాం:**

**1. ఆది 1:26.** యెలోహీమ్ **మన స్వరూపమందు మన పోలికె చొప్పున** నరులను చేయుదము; వారు సముద్రపు చేపలను ఆకాశ పక్షులను పశువులను సమస్త భూమిని భూమిమీద ప్రాకు ప్రతి జంతువును ఏలుదురుగాకనియు పలికెను.

ఆది 1:27. **యెలోహీమ్ తన స్వరూపమందు నరుని సృజించెను; యెలోహీమ్ స్వరూపమందు వాని సృజించెను;** స్త్రీనిగాను పురుషునిగాను వారిని సృజించెను.

**"మన స్వరూపమందు మన పోలికె చొప్పున"** అనువాక్యాలు తీసుకుని కథలు అల్లుతారు. కాని మీరు జాగ్రత్తగా పరిశీలిస్తే... 27వ వచనములో **"తన స్వరూపమందు"** నరుని సృజించెను అని ఉంటుంది.

**(ఇక్కడ ఇద్దరున్నారని లేక ముగ్గురున్నారని అనడానికి అవకాశం ఏది?)**

**2. ఆది 3:22.** అప్పుడు యెలోహీమ్ అయిన యావె ఇదిగో మంచి చెడ్డలను ఎరుగునట్లు, ఆదాము **మనలో ఒకనివంటి వాడాయెను**. కాబట్టి

అతడు ఒకవేళ తన చెయ్యి చాచి జీవవృక్షఫలమును కూడ తీసికొని తిని నిరంతరము జీవించునేమో అని.....

**"మనలో ఒకనివంటి వాడాయెను"** ఈ మాట తీసుకుని కథలు అల్లుతారు. కాని ఇక్కడ దేవుడు తన పరలోక సైన్యసమూహముతో కలిసి మాట్లాడుచున్నాడు: ఈ వాక్యములు చదవండి. ఆది 11:7, 1.రాజులు 22:19, 2 దిన 18:18, యెషయా 6:1-5, దానియేలు 7:9,10.

## ఇక్కడ మరొక విషయం గుర్తుంచుకోవలసింది ఏమిటంటే....

నరులను యెలోహీమ్ అయిన **యూవె ఒక్కడు మాత్రమే** సృజించాడు. అక్కడ ఆయనతో సమానమైనవారు ఇంకొకరు ఎవరూ లేరు.

యెషయా 45:12 భూమిని కలుగజేసినవాడను **నేనే దానిమీదనున్న నరులను నేనే సృజించితిని** నా చేతులు ఆకాశములను విశాలపరచెను వాటి సర్వసమూహమునకు నేను ఆజ్ఞ ఇచ్చితిని.

యెషయా 44:24. గర్భమునుండి నిన్ను నిర్మించిన నీ విమోచకుడగు యూవె ఈలాగు సెలవిచ్చుచున్నాడు **యూవెనగు నేనే సమస్తమును జరిగించువాడను నేనొకడనే ఆకాశమును విశాలపరచినవాడను నేనే భూమిని పరచినవాడను.**

**(ఇక్కడ ఇద్దరున్నారని లేక ముగ్గురున్నారని అనడానికి అవకాశం ఏది?)**

**3. ఆది 11:7.** గనుక మనము దిగిపోయి వారిలో ఒకని మాట ఒకనికి తెలియకుండ అక్కడ వారి భాషను తారుమారు చేయుదము రండని అనుకొనెను.

8. ఆలాగు **యావె అక్కడ నుండి భూమియందంతట వారిని చెదరగొట్టెను** గనుక వారు ఆ పట్టణమును కట్టుట మానిరి.

9. దానికి బాబెలు అను పేరు పెట్టిరి; ఎందుకనగా అక్కడ యావె భూజనులందరి భాషను తారుమారుచేసెను. అక్కడ నుండి యావె భూమియందంతట వారిని చెదరగొట్టెను.

**"మనము దిగిపోయి"** అనే మాట తీసుకుని ఇక్కడ కూడా కథలు అల్లుతారు కాని చూడండి:

**యావె అక్కడ నుండి భూమియందంతట వారిని చెదరగొట్టెను**

**యావె భూజనులందరి భాషను తారుమారుచేసెను**

**యావె భూమియందంతట వారిని చెదరగొట్టెను.**

ఇక్కడ కార్యం చేసింది అంతా ఎవరు అని చూస్తే...యావె.

**(ఇక్కడ ఇద్దరున్నారని లేక ముగ్గురున్నారని అనడానికి అవకాశం ఏది?)**

**4. ఆది 18:1.** మరియు మమ్రే దగ్గరనున్న సింధూరవనములో అబ్రాహాము ఎండవేళ గుడారపు ద్వారమందు కూర్చునియున్నప్పుడు **యావె అతనికి కనబడెను.**

2. అతడు కన్నులెత్తి చూచినప్పుడు **ముగ్గురు మనుష్యులు** అతని యెదుట నిలువబడి యుండిరి. అతడు వారిని చూచి గుడారపు వాకిటనుండి వారిని ఎదుర్కొనుటకు పరుగెత్తి, నేలమట్టుకు వంగి

3. ప్రభువా, నీ కటాక్షము నామీద నున్న యెడల ఇప్పుడు నీ దాసుని దాటి పోవద్దు.

ఇక్కడ **"ముగ్గురు మనుష్యులు"** అని చదవగానే అబద్ధబోధకులంతా తండ్రి-కుమార-పరిశుద్ధాత్మ అని అంటారు. అది సుద్ధ తప్పు: ఈ ముగ్గురిలో ఒకాయన యావె, మిగతా ఇద్దరు దేవదూతలు.

**యావె:** ఆది 18:1,3,13,14,17,20-31.

**దూతలు:** ఆది 18:22, 19:1-27

ఈ ఇద్దరు దూతలు లోతు దగ్గరకు వెళ్ళి లోతును విడిపించి బయటకు తీసుకువస్తాయి.

**(ఇక్కడ ఇద్దరున్నారని లేక ముగ్గురున్నారని అనడానికి అవకాశం ఏది?)**

**5. యెషయా 6: 8.** అప్పుడు నేను ఎవని పంపెదను? మా నిమిత్తము ఎవడు పోవునని ప్రభువు సెలవియ్యగా వింటిని. అంతట నేనుచిత్తగించుము నేనున్నాను నన్ను పంపుమనగా

**"మా నిమిత్తము ఎవడు పోవునని"** ఈ మాట తీసుకుని కథలు అల్లుతారు.

"అత్యున్నతమైన సింహాసనమందు ప్రభువు ఆసీనుడైయుండగా నేను చూచితిని"

సింహాసనము మీద కూర్చున్నవాడు ఒక్కడే: ఇద్దరు లేక ముగ్గురు కూర్చోలేదు. కావున చాలా జాగ్రత్తగా వాక్యాన్ని అర్ధం చేసుకోవాలి.

**(ఇక్కడ ఇద్దరున్నారని లేక ముగ్గురున్నారని అనడానికి అవకాశం ఏది?)**

ఈ క్రైస్తవ బోధకుల బుర్రల్లో త్రిత్వము, దిత్వము అనే సాతాను బోధ నర నరాల్లోను జీర్ణించుకుపోయి ఎక్కడ బహువచనము లాగ కనిపించినా అక్కడ త్రిత్వం లేదా దిత్వం ఉందని కథలు అల్లేస్తూఉంటారు. చాలా జాగ్రాగా ఉండండి.

రాబోయే సంచికలో క్రొత్త నిబంధనలో కూడా ఈ బోధకులు త్రిత్వం, దిత్వం మీద వాక్యాలు చూపి0చి ఎలా మనలను మోసం చేస్తున్నారో చూపిస్తాను. అంతవరకు మీ అందరికి షలోమ్

**Bro. Isaac E. Kusuma., 98493 85038**